# ప్రేమలేఖ!

## మాలతీచందూర్

''నా అరవయ్యో ఏట ప్రేమలేఖ అందుకున్నానోయ్'' అన్నారు వాసుదేవరావుగారు.

ఉలిక్కిపడినట్లుగా చూశాడు మూర్తి వాసుదేవరావుగారి వైపు.

వాసుదేవరావుగార్కి డెబ్భై ఏళ్ళకు పైనవుంటాయి. అయిదారేళ్ళ క్రితం సప్తాబ్ది పూర్తి చేసుకున్నారు. మిగలపండిన జామపండువంటి శరీరపు రంగు, తెల్లని గుబురు మీసాలు, నెత్తిమీద పట్టుకుచ్చులాంటి మెత్తని తెల్ల జుట్టు. గ్లాస్కోపంచా, తెల్లలాల్చీ, చేతికర్రతో ప్రతి సాయంత్రం షికారుకి వచ్చి—గబగబ యువకునిలా అడుగులువేస్తూ—నడిచే వాసుదేవరావుగార్కి దగ్గరదగ్గర ఎనభై ఏళ్ళు వున్నాయంటే ఎవరూ నమ్మరు. వార్ధక్యం కొందరి ముఖాలకి కొత్త అందాన్ని, హుందాతనాన్ని యిస్తుంది. అటువంటి కొందరిలో వాసుదేవరావుగారు ఒకరు.

''నువ్వూ నమ్మడంలేదు కదూ?'' అడిగారు ఆయన దూరాన ఎగిసి పడుతున్న సముద్ర కెరటాలని చూస్తూ.

మూర్తి జవాబు యివ్వలేదు. వాసుదేవరావుగారు మామూలు సముద్రపు వొడ్డుకు వొచ్చే సగటు రిటైర్డ్ ఆఫీసరులాగా, చూసేవాళ్ళకు అనిపించవచ్చు. కాని మూర్తికి తెలుసు, ఈయనలో ప్రత్యేకమైన వ్యక్తిత్వం వుందని! ఆ కాలంలో అంటే బాంకులు జాతీయం చేయక మునుపు—ప్రయివేట్ బాంకులో మేనేజింగ్ డైరెక్టరుగా వుండేవారు. ఆ తరువాత—బాంకులని జాతీయం చేశారుకూడా. బాంకింగ్ బోర్డు ఎడ్వయిజరుగా వుండి, కావాలనే పదవికి రాజీనామా చేశారు.

బాంకులని జాతీయం చేయకముందు ఆయన ఎందరికో వుద్యోగాలు యిప్పించారు. ఆయన సిఫార్సుతో మామూలు చిన్న గుమాస్తాలుగా చేరిన వాళ్ళు, చాలా బాంకుల్లో పెద్దపెద్ద వుద్యోగస్తులుగా వున్నారు ఈ రోజు. బాంకింగ్ సర్కిల్సులో ఆయనపేరు తెలియని వారు వుండరు.

వాసుదేవరావుగారి భార్యపోయి పదేళ్ళు అయిందని వినివున్నాడు మూర్తి. అంటే, ఆమె బ్రతికి వుండగానే ప్రేమ వ్యవహారం సాగించారా?

గుబురు మీసాల వెనక నుంచి సన్నగా నవ్వుతున్నారు వాసుదేవరావుగారు. వెడల్పుగా వున్న ఆయన చెవులవంక చూస్తున్నాడు మూర్తి.

''ఏమిటోయ్...ఈ వోల్డ్‌మాన్ ప్రేమ కబుర్లు చెపుతున్నాడని నవ్వుకుంటున్నావా?'' అడిగారాయన.

నిజానికి మూర్తికి ఆయన ప్రేమ గురించి వినాలన్న కుతూహలం లేదు, వినే వోపికాలేదు. తన సమస్యతో తను తల్లకిందులవుతున్నాడు.

''నన్ను పెళ్ళిచేసుకోండి. ఎప్పుడూ మీ దగ్గరే వుండిపోతాను'' అంటూ—అరవై ఏళ్ళవాడు మారేజ్ ప్రపోజల్ అందుకున్నప్పుడు—అతని మనస్థితి ఎలా వుంటుందంటావ్?'' అడిగారు వాసుదేవరావుగారు.

ఈయనకి నిజంగానే 'సెనిలిటీ' వస్తోందా? తన ప్రేమలీలల గురించి హరికథ చెపుతాడు కాబోలు అనుకున్నాడు మూర్తి.

''అప్పటికి బాంకులు జాతీయం చెయ్యలేదు. ఇందిరాగాంధి బాంబుపేల్చినట్టు, బాంకులు జాతీయం చేసేందుకు రాత్రికిరాత్రి ఆర్డినెన్స్ జారిచేసిన రోజులు'' చేతికర్ర గడ్డం క్రింద ఆనించి అనంత సాగరం వైపు చూస్తూ అన్నారు వాసుదేవరావుగారు.

ఈ ముసలాయనకు నిజంగానే మతిపోతూవున్నది. బాంకులు జాతీయం చెయ్యలేదంటున్నారు, మళ్ళీ చేశాకంటున్నారు.

''మా అబ్బాయి ఆ వారంలోనే లండన్ నుంచి వచ్చాడు. వాడి వెంట మా కోడలు రాలేదు...'' ఆగిపోయారు వాసుదేవరావుగారు.

ఈసారి మూర్తి కాస్త నిటార్గా కూచున్నాడు. ఆయన చెప్పే విషయాల గురించి వినాలన్న కుతూహలం కలుగుతూ వుంది. అసలు వాసుదేవరావుగారు తన కొడుకు గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. కొడుకూ, అతని విషయాలూ కాలగర్భంలో కలిసిపోయిన సంగతుల్లాగా!

''మా అబ్బాయి, మా యిష్టానికి వ్యతిరేకంగా ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ విషయాలు నీకు తెలియవుగదూ!'' అడిగారు.

తెలియవు అన్నట్లు తల వూపాడు మూర్తి. వాసుదేవరావుగారి కొడుకు గురించే కాదు తనకి చాలా విషయాలు తెలియవు.

ఈ సృష్టిలో పశులు, జంతువులు, వృక్షాదులు యిలా వివిధ జంతువులు వున్నట్లే మనుషుల్లో కూడా వృత్తులబట్టి జాతులు ఏర్పడుతుంటాయి. అలాంటి 'బాంకింగ్ జాతి'కి చెందినవాడు మూర్తి కూడా. వాసుదేవరావుగారు బాంకింగ్ గురించి రాసిన యింగ్లీషు గ్రంథం యించుమించు బాంక్ ఆఫీసర్స్ అందరికీ పెద్ద బాలశిక్ష వంటిది. ఆఫీసర్ రాంకులో వున్న ప్రతి వాళ్ళూ దానిని చదివి వుంటారు. అల్లా పరిచయం అయింది ఆఫీసరుగా రిక్రూట్ అయిన మూర్తికి వాసుదేవరావుగారితో.

మూర్తికీ, వాసుదేవరావుగారికీ మధ్య అర్ధశతాబ్దపు వ్యత్యాసం వుంది. వయసులో, భావాల్లో, ఆలోచనా విధానంలో సమన్వయం అంటూ వుండేదికాదు. కాని వాసుదేవరావుగారి కాలంనాటి పాత బాంకింగ్ విధానం, ఈ నాటి ఋణాల మేళాల కంటే ఆర్థికంగా పటిష్టవంతమైనదని మనసులో తెలిసినా, పైకి వొప్పుకునేవాడు కాదు మూర్తి. అయితే అప్పుడప్పుడు గట్టి సమస్య వచ్చినపుడు వాసుదేవరావుగారిని సంప్రదిస్తూ వుండేవాడు. ముప్ఫైయేళ్ళ వయసున్న యీ యువకుడూ, అష్టాబ్ది చేరుకోబోతున్న ఆయనా, యిద్దరూ ఒకే వృత్తికి చెందినవారు. ఆయనది అనుభవం; ఇతనిది వుత్సాహం.

''బాంకులు యిస్తున్న ఈ ఋణాలు, మేళాలు వల్ల బీద ప్రజలు బాగుపడడంలేదు. వారిని సోమరులను చేస్తున్నారు మీరంతాకలిసి! మా కాలంలో బాంకుల్లో ఒక పట్టాన అప్పు యిచ్చేవాళ్ళంకాదు. ఇచ్చిన అప్పు తీర్చేదాకా అవతలవాళ్ళకి నిద్రపట్టేది కాదు. సింహస్వప్నం బాంక్‌లంటే...ఈ బాంకు ఋణాలు తాత్కాలికంగా కళ్ళనీళ్ళు తుడుస్తాయి తప్ప, అసలు

దుఃఖాన్ని పోగొట్టలేవు. మీరు ఋణాలు పంచి పెడ్తున్నారేగాని, వాటి వసూలు గురించి పట్టించుకోడం లేదు'' అనేవారు వాసుదేవరావుగారు.

''ఎందుకు చెయ్యడంలేదు? మీ కాలంలో ఏ పదిమంది గొప్పవాళ్ళకో ఋణాలు అందేవి. ఇప్పుడు అలా కాదు. ఎక్కువమంది సామాన్యులకి, బీదవారికి ఋణాలు యిచ్చి వారి జీవితాల్ని బాగుచేస్తున్నాం. మీ రోజుల్లో మీరు వున్నవాళ్ళకి మటుకే యిచ్చేవారు. మేము వున్నవాళ్ళకీ—లేని వాళ్ళకీ కూడా యిస్తున్నాం...'' అని మూర్తి సమాధానం చెప్పేవాడు.

ఆ సాయంత్రం మూర్తి మనసు కలవరంగా వుంది. ఎటూ నిర్ణయించుకోలేని సందిగ్ధంలో పడి కొట్టు కుంటున్నాడు.

కూచున్న సిమెంటు బెంచీకి కొంచెం దూరంలో వాసుదేవరావుగారి కారు. ఆ కారుని ఆనుకుని డ్రయివర్ చేతులు కట్టుకు నిల్చుని వున్నాడు. రోజూ యింటినుంచి బీచ్ దాకా దాంట్లో వచ్చి బీచి వద్దున ఒక మైలుదూరం నడిచి—బెంచీ మీద కూచుంటారు వాసుదేవరావుగారు.

''నువ్వు మా ఆవిడను చూడలేదుగదూ?'' అడిగారు వాసుదేవరావుగారు.

మళ్ళీ గతంలోకి పడి పోతున్నారు. ఆ ప్రేమలేఖ రాసిన అమ్మాయిని పెళ్ళాడలేదుగదా కొంపదీసి!

''మా ఆవిడపోయి—పదేళ్ళయింది'' అన్నారాయన నిదానంగా.

మూర్తి వూపిరిపీల్చుకున్నాడు.

''మా అబ్బాయి లండన్‌లో వున్నపుడు తన కొలీగ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ పెళ్లి గురించి నేనంత బాధపడలేదుగాని, మా ఆవిడకు చాలా కష్టం వేసింది.''

''ఆడవాళ్ళు కదా! ఆమెకి ఏం ఆశలు వుండేవో!''

''ఆశలు కంటే—ఆ అమ్మాయి తీరు మా ఆవిడకు నచ్చలేదు. ఆ పిల్ల హిందువైనా, ఎప్పుడూ ఇంగ్లండులో పుట్టినట్టే మాట్లాడుతూండేది. ఒక్క మూడురోజుల కంటే అబ్బాయిని మా దగ్గర వుండనిచ్చేదికాదు...''

''ఎందుకని?''

''ఇప్పుడు కామన్ అయిందికాని, ఆరోజుల్లో ఆడ వాళ్ల స్మోకింగ్ అంటే కాస్త షాకింగ్‌గా వుండేది. పోనీ, తాను యీ దేశంలో పుట్టలేదా అంటే, ఇక్కడే మహా రాష్ట్రలో పుట్టిన అమ్మాయి. పాంటూ, షర్టూ వేసుకుని స్మోక్ చేస్తూ తిరుగుతూండేది'' అన్నారాయన.

మూర్తి ఈ పెద్దాయన పరిస్థితి వూహించు కునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఒక్కగాని ఒక్క కొడుకు. సిగరెట్లు తాగే మొగరాయుడి వంటి కోడలు...

''నేను సర్దుకు పోతూండేవాడిని కాని మా ఆవిడ పట్టుదల మనిషి. ఒకరకంగా ఆవిడ మనసు విరిగి పోయింది. 'మీకు నేను—నాకు మీరు. మనకు కొడుకు లేదు, కోడలు లేదు' అంటూ గుండె రాయి చేసుకుంది...'' ఆగారు వాసుదేవరావుగారు. ఆయన కంఠం బొంగురుగా వున్నా, దృఢంగా వుంది.

''సరిగ్గా అటువంటి టైములోనే బాంకులు జాతీ



## కృష్ణశాస్త్రి

(ఆశువు)

భ వితవ్యంబగు నవ్యభావకవితా వైతాళికా!
ఊర్వశీ
యువతీ స్వాగత మంది నంతటనె ఓహో! పల్లకీ నెక్కి
నీ
వవురా! దేవులపల్లి జేరితివ! కావ్యశ్రీల
స్వర్ణోజ్జ్వలో
త్సవముల్ కన్నుల నిల్చిపోయినవి
తృష్ణా కృష్ణపక్షమ్ములై

-అవధాని మాడుగుల నాగఫణి శర్మ

యం చెయ్యడం! ఇది మాలో చాలామందికి యిష్టం లేదు. ప్రభుత్వం కల్పించుకుందీ అంటే బాంకర్స్‌లో వున్న నిజాయితీ—ఏకాగ్రత దెబ్బతింటాయని మా భయం. ప్రజల మూలధనానికీ, మమ్మల్ని నమ్మి దాచుకున్న నిలవధనానికీ మేము ధర్మకర్తలం మాత్రమే అని నమ్మేవాళ్ళం మేమందరమూ. బాంకింగ్ సర్కిల్స్ వుక్కిరిబిక్కిరిగా వున్న కాలంలో మా అబ్బాయి తన కూతురితో పాటు లండన్ నుంచి దిగాడు'' అన్నారు వాసుదేవరావుగారు.

''మీకు మనుమరాలు వున్నట్లు నాకు తెలియదే?'' అడిగాడు మూర్తి ఆశ్చర్యంగా.

''నా గురించి నీకేం తెలుసు?'' వాసుదేవరావుగారి ప్రశ్న సవాల్ చేస్తున్నట్లు!

అవును, ఆయన గురించి తనకేం తెలుసు. విశాలమైన వారింట్లో, ముందు హాల్లో ఎప్పుడైనా వెళ్ళి కూచున్నప్పుడు వంటవాడు కాఫీ, బిస్కట్లు యివ్వడం, ఆయన లోపలి నుంచి బయటకొచ్చాక మాట్లాడి ముందు హాల్లోనించే తను బయటకు రావడం తప్ప. తను ఆ యింట్లో ఎవరున్నారో, ఎంత మంది వున్నారో కూడా చూడలేదు.

''ఆసారి వచ్చినపుడు మా అబ్బాయి పదిరోజులు మా దగ్గర వున్నాడు. ఎవరితో మాట్లాడేవాడు కాదు. గదిలో పడుకుని పగలూ, రాత్రీ నిద్రపోతూండే వాడు...''

''మనుమరాలో?''

''దానికి అయిదేళ్ళు. ఆ దేశంలో పుట్టిన పిల్లేమో బాగా పొడవుగా, ఏడేళ్ళ పిల్లలా కనిపిస్తూండేది. వచ్చినప్పటి నుంచీ—మా అబ్బాయి పిల్ల తిన్నదో లేదో కూడా కనుక్కోలేదు, మా ఆవిడ మీద వొదిలేసి...''

''మీ ఆవిడకు చేరికయిందా?''

''లేదు. అంతక్రితం వచ్చినపుడు ఒకటి రెండు సార్లు పిల్లని దగ్గరకు తీస్తే మా కోడలు ఆ చిన్నదాన్ని బరబరా తన గదిలోకి లాక్కుపోతూండేది. మాతో కలవనిచ్చేది కాదు...''

''ఎందుకని—జెలసీయా?''

''మావాడు పర రాష్ట్రం అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడుగాని, వాడికి అంత అల్ట్రామోడరన్ దృక్పథం లేదు. భార్య అంటే మన భారతీయుల్లాగా ఆలోచించే వాడు...''

''మీ కోడలు మటుకు ఈ దేశపు ఆవిడ కాదా?''

''అవును. కాని, పెళ్ళాం కాబట్టి మొగుడు మాట వినాలి. ఇల్లూ, సంసారం యివి చూసుకోవాలి అంటే వొప్పుకునే తత్వంకాదు. బొంబాయిలో పెరిగి అక్కడ చదువుకున్న అమ్మాయి...''

''ఘర్షణ పడుతుండేవారా?''



''మాదాకా ఏమీ వచ్చేదికాదు. ఆసారి వచ్చినపుడు మటుకు మావాడు మనుమరాలిని మాతో ఒక నెల రోజులు వుంచుకోమని కోరాడు.''

''మీరు వొప్పుకోలేదా?''

''మనసులో యిష్టంలేదు. నేను అలా అనుకోడం చాలామందికి అసహజంగా అనిపించవచ్చు''.

మూర్తి అవును అనలేదు, కాదు అనలేదు. ఎన్నడూ తమ కుటుంబ విషయాల గురించి మాట్లాడని వాసుదేవరావుగారు యీ రోజు తన కొడుకు గురించిన విషయాలు ఎందుకు చెపుతున్నారు?

''పెద్దతనంలో శరీరమేకాదు, హృదయం కూడా చాలా బలహీనంగా వుంటుందోయ్. గాజు బుడ్డిలాగా చాలా అస్తారుపదంగా కాపాడుకోవాలి ఈరెంటినీ...''

ప్రశ్నార్థకంగా చూశాడు మూర్తి. శరీరమా, హృదయమా అన్నట్లుగా!

''ఈ శరీరం బలహీనమయితే డాక్టర్లు వుంటారు, మందులుంటాయి. హృదయం వుంది చూశావూ, అది వెన్నలాగా ఏ మాత్రం వేడి తగిలినా కరిగిపోతుంది. అజాగ్రత్తగా వుంటే పగిలిపోతుంది. మా ఆవిడతో చెప్పాను. ''మనుమరాల్ని ఒక నెల్లాళ్ళు వుంచుకున్నా, ఆ పిల్లమీద మమకారం పెంచుకోకు—అంటే ముట్టనట్టుగా వుండు—అని''

''ఉండగలిగారా?''

''ఒక రకంగా వుండగలిగాం. ఎట్లాగో తెలుసా? 'నాకు నువ్వు—నీకు నేను' అన్న మా దాంపత్యపు బంధం చాలా గట్టిగా అల్లుకుంది గనక!''

''ప్రేమలేఖ అందుకున్నానన్నారు. అయితే మీరూ—మీ ఆవిడా ప్రేమలేఖలు రాసుకునేవారా?'' అడిగాడు మూర్తి.

''ఉహూ. ఆ అవసరం మాకు కలగలేదు. మేము ఒకర్ని విడిచి మరొకరు వుండలేదు. రెండుసార్లు యూరప్ వెళ్ళాను. ఇంగ్లీషు రాక పోయినా వెంటలాక్కుపోయాను మా ఆవిడను'' జ్ఞాపకాల బరువుల్తో ఆయన కళ్ళు నల్లగ అయినాయి. కనుగుడ్లలో బీచి దీపాలు ప్రతిఫలించాయి.

మూర్తి కళ్ళజోడు లేని ఆయన కళ్ళవంక చూస్తున్నాడు. వాసుదేవరావుగార్కి చత్వారం వచ్చి పోయిందట. ఇప్పుడు జోడులేకుండా చదవడమేకాదు, దూరపు వ్యక్తిని కూడా గుర్తించగలరు.

''మనుమరాలి పేరు చెప్పలేదు'' అడిగాడు మూర్తి.

''మేము బేబీ అని పిల్చేవాళ్ళం. పేరు ఏదయితే ఏంలే. బేబి యీ ముసలి వాళ్ళిద్దరికీ ఎంత చేరువగా రావాలని ప్రయత్నించేదో—అంత దూరంగా వుంచే వాళ్ళం.''

''అన్యాయం కాదూ?''

''ఎవరికి? మాకా, బేబీకా?''

''బేబికే...''

''కాదు. ఆటసామాన్లు, ఆలనా పాలనా, కార్లో షికార్లు, కబుర్లు అన్నీ వుండేవి. రోజూ బేబి షికార్లు, ఆటలు. ఏ లోపం చేసేవాళ్ళం కాదు. ఏ క్షణంలో బేబిని వాళ్ళ నాన్న తీసుకు వెళ్ళినా—మనం బాధపడకూడదు. మమకారం పెంచుకోకూడదు అని గట్టి నిర్ణయం

తీసుకున్నాం. మా మనసుల్ని రాయిచేసుకున్నాం.''

''తరువాత ఏం జరిగింది?''

''నెల్లాళ్ళు అయాక మా అబ్బాయి లండన్ నుంచి వచ్చాడు.'' ఆయన నిశ్శబ్దంగా అయిపోయారు.

మూర్తికి ప్రేమలేఖ రాసిన ఆ యువతి గురించి వినాలనివుంది. అరవై ఏళ్ళ వయసులో ఈయనకి ప్రేమలేఖ రాయగల యువతి ఎలా తటస్థపడింది?''

''మీకు సెక్రటరీ వుండేదా?'' అడిగాడు మూర్తి మనసులో వచ్చిన ఆలోచన ఆపుకోలేక.

''వుండేవాడు—వుండేదికాదు'' అన్నారు వాసుదేవ రావుగారు లింగ భేదాన్ని వొత్తి పల్కుతూ.

గెస్సింగ్ గేములో వోడిపోయి, నోరుమూసుకు కూచున్నాడు మూర్తి.

''మా అబ్బాయి, భార్యా విడిపోదామని నిశ్చయానికి వచ్చారట... ఆఖరి ప్రయత్నంగా ఒక ఆరు నెలలు ఒకరికొకరు దూరంగా వుండాలని నిర్ణయించు కున్నారు...''

''మరి మనుమరాల్ని మీ దగ్గరవుంచారా?''

''ఊహూ. వాడు వుంచుతానని అనలేదు. మాకూ యిష్టంలేదు. అయితే అమ్మాయిని ఇండియాలో వుంచి చదివించాలని వాడి వుద్దేశం. ఎక్కడైనా బోర్డింగ్ స్కూల్లో మంచి యింగ్లీషు స్టాండర్డ్ వున్న స్కూల్లో చేర్పిస్తానన్నాడు.''

''మీరు వొప్పుకున్నారా?''

''మాదేముంది? చదువు చెప్పించాం, పెద్ద వాడయ్యాడు. కోరి పెళ్ళిచేసుకున్నాడు.''

''నిజమే అనుకోండి. కాని ఈ అయిదేళ్ళ పిల్ల, తల్లీ దండ్రీ, తాతగారు, మామ్మ అంతా వుండి...''

''ఆ ఇంగితం వాళ్ళకుండాలి. మా కోడలు తను ఆ పిల్లని పెంచలేను, హాస్టల్లో వుంచమందట. వుంచవా వద్దా అని మమ్మల్ని సలహా అడగలేదు. 'అప్లికేషన్సు—మంచి స్కూళ్ళు' అంటూ ఆ వేసంగి రెండు నెలలూ, అటు ఆల్మోరా నుంచి యిటు వూటీదాకా అన్ని స్కూళ్లూ చూపొచ్చాడు.''

''నచ్చలేదా?''

''వాడికి నచ్చింది. కాని ఈ రెండు నెలల్లో బేబి—కొద్ది కొద్దిగా మా మనసుల్ని కొల్లగొట్టడం ఆరంభించింది. వాళ్ళ మామ్మతో పొద్దుటే లేవడం, నాతో సాయంత్రం షికార్లు. ఫ్రాకులు మానేసి పరికిణీలు కట్టుకోవడం, బాబ్ వొద్దు జడ వెయ్యమంటూ పేచీ—ఇలా అల్లుకు పోవడం మొదలుపెట్టింది.''

''బేబికి లేడీ ట్యూటర్‌ని పెట్టారా?'' అడిగాడు మూర్తి 'ప్రేమలేఖ' సంగతి వదలడం యిష్టంలేక.

''ఏమిటోయ్—సినిమాలు తెగ చూస్తున్నట్లున్నావే?'' అంటూ పకపక నవ్వారు రావుగారు.

''మీరు ప్రేమలేఖ సంగతి వదిలేసి, మిగతా అన్నీ చెపుతున్నారు.''

''దైవదర్శనం చేసుకోవాలంటే ముందు ప్రాకార ప్రదక్షిణం చెయ్యాలి కదటోయ్. చివరికి గదా మూల విరాట్ కనిపించేది...'' అన్నారు నవ్వుతూ.

మూర్తి బదులు చెప్పకుండా వూరుకున్నాడు.

''ఎక్కడ చదివించాలో నిర్ణయం అయిపోయింది.

## త్రికాలజ్ఞ నిరుద్యోగి

గతం ఒక ఎడారి—
తల్చుకొని ఆనందించగల్గే
డాఫోడిల్సు అక్కడ లేవు!

భవిష్యత్తు ఒక మైదానం—
రంగు-రంగుల పూలు పూచే
మొక్కలు నాటే శక్తి లేదు!!

వర్తమానం ఒక స్వప్నం—
మేల్కొని కూచొనే వరకూ
ముగింపు ఏమిటో తెలీదు!!!

—దొడ్లంకి వెంకట్రావ్

మంచి హాస్టలు, క్రమశిక్షణా, చదువూ గల స్కూల్లో ఎడ్మిషన్ వచ్చింది. అమ్మాయికి కావలసిన యూనిఫారమ్స్, బెడ్డింగ్, దుప్పట్లు, నైట్ డ్రస్సులు యిలా హాస్టలు వాళ్ళ నిబంధన ప్రకారం ప్లాస్టిక్ బకెట్‌తో సహా అన్నీకొనడం అయిపోయింది. ఆ మరునాడు వుదయం బేబిని తీసుకెళ్ళిపోతున్నాడు వాళ్ళనాన్న హాస్టల్లో చేర్పడానికి. ఆ రాత్రి తొమ్మిదింటివేళ ముందు హాల్లో కూచుని చదువుకుంటున్నాను. బేబి నెమ్మదిగా నా దగ్గరకొచ్చి, మెడచుట్టూ చేతులువేసి, 'తాతయ్యా' అంటూ గట్టిగా కావలించుకుని—'ఈ లెటర్ చదువుకో' అంటూ యిచ్చేసి గబగబ హాల్లోంచి వెళ్ళిపోయింది'' ఆగారు వాసుదేవరావుగారు. ఆయన కళ్ళు తళతళ మంటున్నాయి. జ్ఞాపకాల మాధుర్యం ఆయన కళ్ళలో కాంతివంతంగా ప్రతిఫలిస్తూవుంది.

మూర్తికి, కొద్దికొద్దిగా బోధపడుతోంది. ఆయన ఏకాగ్రత చెడగొట్టడం యిష్టంలేక నిశ్శబ్దంగా చెవులు దోరబెట్టుకు వింటున్నాడు.

''బేబీ ఏం రాసింది? ఫేర్‌వెల్ లెటరా? బర్త్‌డే గ్రీటింగ్సా—ఏం రాసింది? అంత క్రితం సంవత్సరానికి మామ్మ బర్త్‌డేకి గ్రీటింగ్స్ కవర్లో పెట్టి యిచ్చింది. ఏం రాసింది? కుతూహలంగా విప్పాను. ''తాతయ్యా, అయ్ లవ్ యు— నన్ను పెళ్ళి చేసుకో. మామ్మలాగా ఎప్పుడూ నీ దగ్గరే వుండిపోతాను. నన్ను ఎక్కడికీ పంపకు.''

''ఇంగ్లీషులో బ్లాక్ లెటర్స్‌లో రాసిన ప్రేమలేఖ అది...'' ఆ మాటలు అంటున్నపుడు వాసుదేవరావు గారి కంఠంలో ఆనందం, గర్వం ప్రతిధ్వనించాయి.

''మా హృదయాలు గాజుబుడ్లు అనుకున్నాము. అవి ఇనుపబుడ్లని నాకు ఆ క్షణంలో అర్థమయింది. ఆ మూడు నెలలూ నేను ఎంతో సెల్ఫిష్‌గా నాగురించీ; నా భార్యగురించీ ఆలోచించాను. ఎంతకూ మా హృదయాలు గాయపడకుండా తప్పించుకునే ప్రయత్నంలో వున్నానే తప్ప—ఆరేళ్ళ ఆ పసి హృదయం ప్రేమకోసం, రక్షణ కోసం ఎంత పరితపించిపోతోందో గ్రహించుకోలేక పోయాను. వయసుతో మనిషి హృదయం విశాలమవుతుందా? లేక, కుదించుకుపోయి స్వార్థపరుని చేస్తుందా?'' అన్నారు రావుగారు. ఆ పసిహృదయాన్ని, మమతని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించని తన కాఠిన్యాన్ని తప్పుబడుతూ!

''బేబి మీదగ్గరే వుండి పోయిందా?''

''ఆ వుత్తరంతో—నేనుమళ్ళీ మనిషినయ్యాను. అంతవరకూ ప్రేక్షకుడిగా వుండిపోయిన నేను, బేబి మా దగ్గిర వుంటుంది—అంటూ పట్టుబట్టాను. నిజానికి మా అబ్బాయి అంత వ్యతిరేకత చూపలేదు...'

''అదన్నమాట—మీ 'ప్రేమలేఖ'...'' నవ్వుతూ అడిగాడు మూర్తి.

''అది వుట్టి ప్రేమలేఖ కాదోయ్. మా జీవితాల్లో



# సాంధ్యవేళ

శశీ ప్రియా! నీ ధవళకాంతి వనసీమల విహరించి
నా జీరవోయిన గళము శృతి కూర్చనెంచ
ఎడద రొదలోన ఇంకె నా వేదనా గాథలన్ని
చిమ్మ చీకటులై కమ్మె నాలోని నీడలన్నీ
ఈ సాంధ్యవేళల విందునా నీ మధురగీతి?
నీ తుహిన తారలు తివియునా ఈ హృదయ పీతి?

శారద శర్వరీ సుధాపానోత్కంఠనై
పరువు పరువున పరువెత్త తలపువున్న
సంజపడతినే కాంచి సర్వమ్ము కోలుపోతి
బధిరలోకంపు ఈ యాత్ర ముగియకుంది.
రుధిరధారల వెలయునా ముగ్ధరవళి?
వృధా నౌకలు దాటునా ఈ శోక జలధి?

మౌన బాష్పాల నొప్పారు ఈ జగతియందు
మంద భాగ్యాల రాశిగా మారిపోక
నీ నుదుట పండిన తళుకులే పట్టి నేను
మోడు మ్రాకుల వెలిగించి మురిసిపోదు
తెరను తొలగించి చూపవా ప్రభాత ప్రాంగణమ్ము
మరుల పొదరిల్లు చేరునా ఈ మౌక్తికమ్ము?

- పింగళి పాండురంగారావు.

వెలుగు వెన్నెల, కదలిక కాంతీ ఎన్నో తీసుకొచ్చిన అపూర్వ లేఖ. మా బేబీ తన చిటికినవేలు చుట్టూ యీ పెద్ద వాళ్ళిద్దరినీ దారం ముక్కల్లా చుట్టేసుకుంది.''

''మరి పెళ్ళి చేసుకోలేదేం?'' అడిగాడు మూర్తి ఆటలు పట్టిస్తూ.

''నాకంత అదృష్టం లేదోయ్. తొందరపడి యాభై ఏళ్ళు ముందుగా పుట్టేశాను. మా అబ్బాయీ, కోడలూ విడిపోయారు. ఆ తరువాత మా అబ్బాయి పోయాడు. నా భార్య పోయింది. ఇన్ని కష్టాల్లో, యిన్ని బాధల్లో శిథిలమైపోయిన యీ పడవని ముక్కానిలా పట్టుకు నడుపుతూవుంది మా బేబీ...''

''మీ యింట్లో ఆమెని ఎప్పుడూ చూడలేదు.. మీరెప్పుడూ పరిచయం చెయ్యలేదు.''

''ఇంతవరకూ అవసరం రాలేదు.''

''ఇప్పుడొచ్చిందా?''

''నేను బాంకర్ని. ఫిక్స్‌డ్ డిపాజిట్‌కి టైము అయితేగాని ఆ పేపరువైపు తలఎత్తి కూడా చూడను. బేబీ మూడు నెలల క్రితం ఒక వుత్తరం రాసింది.''




తనకెందుకు చెపుతున్నదీ అర్థం కావడం లేదు మూర్తికి.

''నీకు చెప్పాల్సిన సమయం, సందర్భం వొచ్చాయి'' అంటూ వాసుదేవరావుగారు పిన్ చేసిన రెండు వుత్తరాలు మూర్తికి అందించారు.

''చదవవచ్చా?'' అడిగాడు మూర్తి.

''ఒకరి డిపాజిట్‌ని మరొకరికి ఎప్పుడూ యివ్వకూడదు, యిస్తున్నాను...చదువు.''

మొదటి వుత్తరం. 'తాతయ్యా అయ్ లవ్ యూ' అంటూ బ్లాక్ లెటర్స్‌తో రాసిన పదిహేనేళ్ళ క్రితం నాటి లేఖ.

రెండోది: అదిరే గుండెల్తో సందేహ సంతోషాల, ఆశానిరాశల మధ్య వూగిసలాడుతూ, వణికే వేళ్ళతో వుత్తరం మడత విప్పాడు మూర్తి.

ముత్యాల కోవ వంటి అక్షరాల్తో:

''తాతయ్యా, మూర్తి అంటే నాకిష్టం. మా యిద్దరికీ స్టాఫ్ ట్రయినింగ్‌లో పరిచయం అయింది. ఎప్పుడూ రాశాను. ఎలా పరిచయం చేసుకుంటావో నాకు తెలియదు. కలుసుకుని నాకు తగినవాడు అవునోకాదో నువ్వే నిర్ణయించు. నేనెవరో, నువ్వు నాకేమవుతావో నేను చెప్పలేదు. సమయం వచ్చినపుడు ఎలా చెప్పాలో చెప్పే అవసరం వుంటుందో, వుండదో ఆ నిర్ణయం నీకే వదిలేస్తున్నాను. —రాగిణి.''

మూడు నెలల క్రితం రాసిన వుత్తరం. మూర్తికి ఏం మాట్లాడాలో—ఏం చెప్పాలో కూడా బోధపడకుండా వుంది. ప్రొబేషన్ ఆఫీసర్స్ ట్రయినింగ్ పీరియడ్‌లో 'రాగిణి' ని కలుసుకోడం, ఆమె స్థిరమైన అభిప్రాయాలు, వ్యక్తిత్వం, రూపం కళ్ళముందు గిరగిర తిరుగుతున్నాయి.

''మా బేబీని చేసుకున్నవాడు సుఖపడ్తాడు. దానికి ప్రేమించడమే కాదు, ప్రేమించిన వ్యక్తిని పై అంతస్థుపై కూచోబెట్టగల హృదయం వుంది...'' అన్నారు వాసుదేవరావుగారు.

''మూడు నెలలుగా మీతో పరిచయం అయి, రాగిణి మీ మనుమరాలని తెలుసుకోలేకపోయిన నా అమాయకత్వానికి నాకే సిగ్గుగా వుంది.''

''నువ్వు కొద్దిగా కూడా 'గెస్' చెయ్యలేకపోయావా?''

''మీ మాటలు, మీ కబుర్లు నన్ను కట్టి వేస్తూండేవి. ఎక్కడో విన్నాను అని అనిపించేవి. కాని గ్రహించలేకపోయాను...'' అన్నాడు మూర్తి.

''అయితే ఈ రోజే ఫోన్‌చేసి చెపుతాను. గ్రీన్ సిగ్నల్ యిచ్చినట్లుగా'' అన్నారు వాసుదేవరావుగారు సంతోషంగా.

'ప్రేమలేఖ మీకూను—పెళ్ళి నాతోనా?' అని ఓ చిన్న విసురు విసురుదామనుకుని మళ్ళీ నాలిక కొరుక్కుని 'ఓడిపోయానా? గెల్చానా?' అన్న సందిగ్ధంలో పడి, ఎటూ నిర్ణయించుకోకముందే ఆయన వెంట కారులోకి ఎక్కడం, కారుకదలడం, రెండూ జరిగిపోయాయి.

*